ఆ రోడ్డు ఎవరి కోసం..?

- అవసరం లేకున్నా 60 అడుగుల రోడ్డు
- గోప్యంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు
- తీవ్రంగా నష్టపోనున్న ఐదు కాలనీల వాసులు

అవసరం ఉన్న చోట రోడ్డు వెడల్పు చేయని కర్నూలు నగరపాలక సంస్థ అధికారులు అవసరం లేని ప్రాంతాల్లో 60 అడుగుల రోడ్డుకు అనుమతి ఇవ్వడం పలు విమర్శలకు దారితీస్తోంది. కాలనీవాసులకు ఎవరికీ తెలియకుండా మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేపట్టినట్లు తెలిసింది. దీని వల్ల ఐదు కాలనీల వాసులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై ఆయా కాలనీవాసులు ఆందోళన బాట పట్టారు..

ప్రేమ నగర్ నుంచి బాలాజీ నగర్ వరకూ ప్రస్తుతం ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రేమ నగర్, లక్ష్మణ సింగ్ కాలనీ, పోస్టల్ కాలనీ, కొత్త విజయ భాస్కర్ రెడ్డి నగర్, బాలాజీ నగర్‌లలో ప్రస్తుతం 20 నుంచి 30 అడుగుల రోడ్డు ఉంది. ఆ కాలనీల మీదుగా హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారి వరకూ 60 అడుగుల రోడ్డుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అనుమతి ఇచ్చారు. స్థానిక కాలనీ వాసులకు తెలీకుండా గోప్యంగా 60 అడుగుల రోడ్డు కోసం మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారు. దానికి సంబంధించి గత ఏడాది ఫిబ్రవరి 19న ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా ఆయా కాలనీ వాసులకు ఈ విషయం తెలియడంతో పట్టణ పౌర సంక్షేమ సంఘంతో కలిసి ఆందోళన బాట పట్టారు. ప్రస్తుతం ఆ కాలనీల పరిధిలోని ఓ బిల్డర్‌కు చెందిన వెంచర్ ఉంది. అక్కడ మాత్రమే 60 అడుగుల రోడ్డు ఉంది. ఆ బిల్డర్ కోసమే ఐదు కాలనీల మీదుగా 60 అడుగుల రోడ్డు ప్లాన్ ఇచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఐదు కాలనీల్లో దాదాపు 300 వరకూ గృహాలు, స్థలాలు ఉన్నాయి. మాస్టర్ ప్లాన్‌లో 60 అడుగుల రోడ్డు చేర్చడంతో ఖాళీ స్థలాలు ఉన్న వాళ్లు 15 నుంచి 20 అడుగుల రోడ్డు కోసం వదిలేసి కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇళ్లు పునర్నిర్మాణం చేసుకునే వాళ్లు కూడా కొత్త ప్లాన్ ప్రకారం రోడ్డు స్థలం కట్టుకోవాల్సి వస్తోంది. రాబోయే రోజుల్లో ఇళ్లను పడగొట్టి మళ్లీ నిర్మించుకునే వారికి కూడా అదే పరిస్థితి తలెత్తనుంది. 45 అడుగుల పొడవున్న ప్లాట్లకు రోడ్డు కోసం 20 అడుగులు వదిలితే వారికి 25 అడుగులు మాత్రమే మిగులుతుంది. ఆ స్థలంలో ఇళ్లు ఎలా నిర్మించుకోగలమని ఆ కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం స్థలం కోల్పోవడం వల్ల ఆ స్థలాల మీద రుణాలు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. మాస్టర్ ప్లాన్‌లో 60 అడుగుల రోడ్డు చేసిన విషయం స్థానిక కార్పొరేటర్లకు తెలుసా లేదా అన్న విషయంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారా లేదా అన్నది కూడా సందేహంగానే ఉంది. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డు విస్తరణపై దృష్టిపై పెట్టని నగరపాలక సంస్థ అధికారులు జనసంచారం లేని ప్రాంతంలో రోడ్డు వెడల్పు చేస్తూ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. 60 అడుగుల రోడ్డు ప్లాన్ విషయం గోప్యంగా ఉంచారని, ఆ విషయంపై నెలల తరబడి తిరిగి విషయం తెలుసుకోవాల్సి వచ్చిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి తెలిపారు. 60 అడుగుల రోడ్డును ప్లాన్‌లో నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.

మాకు తెలియకుండా చేయడం దారుణం

ఇల్లు నిర్మించుకున్న 20, 30 ఏళ్ల తర్వాత మాకు తెలియకుండా మా ఇళ్ళ ముందు 60 అడుగుల రోడ్డు మంజూరు చేయడం దారుణం. 60 అడుగుల రోడ్డు కావాలని మేము అడగలేదు. మా చుట్టూ ఉండే కాలనీల ప్రజలూ కోరలేదు. మా కాలనీల్లో జనసంచారం కూడా చాలా తక్కువ. ఇలాంటి ప్రాంతంలో ఎవరి కోసం 60 అడుగుల విస్తీర్ణం రోడ్డును మంజూరు చేశారు.

- కె.వరప్రసాద్, రిటైర్డ్ బ్యాంకు ఆఫీసర్, పోస్టల్ కాలనీ.

రోడ్డు వదిలితే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు

ఇప్పట్లో 60 అడుగుల రోడ్డు విస్తరించే పనులు ఏమి చేయటం లేదు. ఆయా కాలనీల్లో 60 అడుగుల రోడ్డుగా 2024లో మాస్టర్ ప్లాన్‌లో మార్పు చేశాం. ఆ సమయంలో నోటీసు బోర్డుపై ప్రకటించి పత్రికల్లో కూడా వేశాము. అప్పట్లో ఎలాంటి అభ్యంతరాలు తెలపకపోవడంతో 60 అడుగుల రోడ్డును మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు. కొత్తగా ఇండ్లు నిర్మించుకోవాలనుకుంటున్న వారు 60 అడుగుల రోడ్డును వదిలి ఇళ్లను కట్టుకునేందుకు అనుమతులు ఇస్తాం. భవిష్యత్తులో అవసరమైతే తప్పనిసరిగా ముందుగా కట్టిన ఇళ్ల యజమానులకు నష్టపరిహారాన్ని ఇచ్చి వాటిని స్వాధీనం చేసుకొని రోడ్డు విస్తరణ పనులు చేస్తాం.

- ప్రదీప్ కుమార్, సిటీ ప్లానర్.

అవసరం ఉన్న చోట్ల చేయాలి

మాస్టర్ ప్లాన్‌లో 100 అడుగులు, 60 అడుగులు ఉన్నచోట వాటిని రక్షించకుండా అవసరం లేని చోట 60 అడుగుల రోడ్డు చేస్తామనడం సరికాదు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రోడ్లను కబ్జా చేస్తుంటే చూస్తూ ఉండటంతో రాజకీయ అండదండలతో రోడ్లను కబ్జా చేసి ఇండ్లను నిర్మిస్తున్నారు. వాటిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అప్పుడు పట్టణ ప్రణాళిక విభాగం వాటికి నోటీసులు ఇచ్చిన వెంటనే వారు కోర్టులకు వెళ్తున్నారు. నగరంలో 133 సచివాలయాలలో ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నారు. ఎవరి పరిధిలో వారు ఎప్పటికప్పుడు కొత్తగా నిర్మించే గృహాలకు అనుమతులు ఇవ్వకుండా వారి పట్టాల ప్రకారంగా ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వాలి. ఎవరైనా కబ్జాలు చేస్తూ రోడ్లపై గృహాలు నిర్మిస్తుంటే వెంటనే ఆపేయాలి లేదా కూల్చి చేయాలి. అప్పుడు ఎలాంటి సమస్యలు రావు.

- టి.రాముడు, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి.

ఉపాధి కూలీల వలసలు అరికట్టాలి

- సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి
- ఎంపిడిఒలు, ఎపిడిలపై చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

మాట్లాడుతున్న కలెక్టర రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అధికారులు అలసత్వం వీడి ఉపాధి కూలీల వలసల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎంపిడిఒ, ఉపాధి హామీ ఎపిడిలు, ఎపిఒలను హెచ్చరించారు. మంగళవారం ఎంపిడిఒలు ఉపాధి హామీ పథకం పర్యవేక్షణ చేసే ఎపిడిలు, ఎపిఒలతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ చేపట్టారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అనేక గ్రామాల్లో ఉపాధి కూలీలు వలసలు వెళు తున్నారన్నారు. గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించడం , బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లకు వెళ్లి వలసలు వెళ్లే వారితో మాట్లాడి వారిని ఆపడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నట్లు కన్పించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశంలో అధికారుల్లో స్పందన లేదని, మేల్కొనాల ని, వలసల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలకు వెళ్లి క్యాంపులు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పిల్లల చదువులు భంగం కాకుండా తల్లిదండ్రులను ఒప్పించాలన్నారు. అవసరమైన చోట సీజనల్ హాస్టళ్లను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వలసలు నివారించేందుకు గాను వలసలు వెళ్తున్న గ్రామాలకు ఎపిఒలు, ఎంపిడిఒ లు టీమ్ లుగా వెళ్లి కూలీలతో మాట్లాడలన్నారు. ఉపాధి హామీ పనుల కల్పన, వేతనం గురించి, పిల్లల చదువులకు భంగం కలుగుతుందని వివరించే విధంగా పూర్తి స్థాయికి అవగాహన కల్పించాలన్నారు.. అందుకు సంబంధించిన ఫోటోలు, వివరాలను తనకు సమర్పించాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. అధికారులు అలసత్వంతో ఉన్నారని, ఇలాగే ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.. రెండు వారాల్లో పూర్తి స్థాయిలో పనులు కల్పించకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధి హామీ ఎపిడిలు సక్రమంగా పనిచేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్ల వారిగా ఈ రెండు నెలలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను రేపు సాయంత్రం లోపు సమర్పించాలని కలెక్టర్ ఎపిడిలను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో డ్వామా పిడి వెంకటరమణయ్య, అన్ని మండలాల ఎంపిడిఒలు, ఎపిడిలు, ఎపిఒలు పాల్గొన్నారు.

నిజమైన అభివృద్ధి కావాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎండమావులను చూపించి అదిగో అక్కడ నీళ్లు ఉన్నాయని ప్రజలకు నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని గోదావరి జలాలను రూ.80 వేల కోట్ల ఖర్చుపెట్టి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చెప్పడం ఎండమావుల్లాగానే ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంజిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడుతూ రూ.80 వేల కోట్లు ప్రజల కోసం ఖర్చుపెట్టి గోదావరి జలాలను భానకచర్లకు తీసుకుని వచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామంటున్నారని అన్నారు. ఇది ప్రజలను మోసం చేయడమే తప్పమరోటి కాదని విమర్శించారు. రూ.పదివేల కోట్లు ఖర్చు పెడితే రాయలసీమలో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తిగా అవడానికి అవకాశం ఉంటే దాని గురించి ఆలోచించకుండా రూ. 80 వేల కోట్లు ఖర్చు పెడతాం అని చెప్పడాన్ని ఎవరికి మోసం చేయడాని కని ప్రశ్నించారు. రాష్ట్ర అప్పుల ఊబిలో కూరుకు పోయిందని, దాని నుంచి బయటపడేయడానికే నేను శ్రమిస్తున్నానని అందుకోసమే సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ఆలస్యం అవుతుందని, దీనిని ప్రజలు గమనించాలని చెబుతున్న ముఖ్యమంత్రి ఎన్నికల ముందు వాగ్దానాలు చేసే సందర్భంలో ఈ విషయాలు తెలియవా అని అన్నారు. రాయలసీమ ప్రజల పట్ల వెనుకబడిన ప్రాంతాల పట్ల కర్నూలు జిల్లా పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విభజన హామీలు అమలుకు కృషి చేయాలన్నారు. లేకపోతే రాబోయే కాలంలో సిపిఎం మహా పోరాటాన్ని చేపడుతుందని, ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టే వరకు ఉద్యమం ఆపమని ఆయన హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశ్వర్లు, నిర్మల, నారాయణ, రామకృష్ణ, ఆనంద్ బాబు, రాముడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

వర్సిటీలకు కాషాయ రంగు

- విసిల నియామకానికి దరఖాస్తుల పరిశీలన
- విద్యాశాఖమంత్రి బంధువు కనుసన్నల్లోనే ఎంపిక
- ఫిబ్రవరిలో కొత్త విసిల నియామకాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యూనివర్సిటీలో బిజెపికి అనుకూలంగా ఉండే వ్యక్తులను మాత్రమే వైస్‌ఛాన్సలర్లుగా నియమించేందుకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సన్నద్ధమయింది. ఇప్పటికే ప్రభుత్వ , ప్రయివేటు యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు వైస్ ఛాన్సలర్ నియామకానికి దరఖాస్తు చేసుకున్నారు. వర్సిటీలో వైస్ ఛాన్సలర్ నియామకానికి సంబంధించిన సర్చ్ కమిటీ కూడా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ, ఉర్దూ క్లస్టర్ యూనివర్సిటీ లున్నాయి. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రాగానే గత వైసిపి ప్రభుత్వ నియమించిన విసిలు స్వచ్ఛందంగా రాజీనామా చేసి వెళ్లాలని ఆదేశించారు. రెండు వర్సిటీలకు చెందిన విసీలు రాజీనామా చేసి వెళ్లారు. మార్చి నెలలో కూడా క్లస్టర్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్ పదవి కాలం కూడా ముగుస్తుంది. ప్రస్తుతం రాయలసీమ, ఉర్దూ విశ్వవిద్యార్థులకు ఇన్చార్జి విసిలపాలన కొనసాగిస్తున్నారు. విసి నియామకానికి గత ఏడాది రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. రాయలసీమ ,ఉర్దూ వర్సిటీలకు విసిల నియామకాలకు సంబంధించిన అనేకమంది దరఖాస్తులు చేసుకున్నారు. రెండు వర్సిటీలకు విసిల నియామకాలకు సంబంధించిన పెద్ద ఎత్తున దరఖాస్తులు కూడా వచ్చినట్లు తెలిసింది. దరఖాస్తులు చేస్తున్న వారిలో అనేకమంది రాష్ట్రంలోరి వర్సిటీల నుండి ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి జాతీయ విద్యా సంస్థలైన ఎన్ఐటి ఐఐటి లాంటి ఉన్నత విద్యా సంస్థల నుండి కూడా ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల గత కొన్ని రోజుల క్రితం హైదరాబాదులో వర్సిటీలకు సంబంధించి విసిల నియామకానికి సెర్చ్ కమిటీ కూడా భేటీ అయింది. ఇప్పుడు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ సమీప బంధువు విశాఖపట్నం ఎంపి విసిల నియామకానికి సంబంధించి ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ వర్సిటీల కు చెందిన ప్రొఫెసర్లు కాకుండా ప్రైవేట్ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లను కూడా విసిలుగా నియమించేందుకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. ఇప్పుడు ఏకంగా బిజెపి అనుకూలంగా ఉన్నటువంటి ప్రొఫెసర్లను విశ్వవిద్యాలయాలకు నియమిస్తే తమ అజెండాను మరింత పక్కాగా అమలు చేసేందుకు సన్నద్ధమైనట్లు తెలిసింది. రాయలసీమ వర్సిటీకి ఇక్కడే పనిచేస్తున్న ఒక సీనియర్ ప్రొఫెసర్ అధికార పార్టీ నేతల సిఫార్సు లేఖల తీసుకున్నారు. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాల యానికి చెందిన మరో ప్రొఫెసర్ కూడా గట్టిగానే ప్రయత్నాలను చేస్తున్నారు. ఉర్దూ వర్సిటీకి కూడా అనేకమంది ప్రొఫెసర్లు పోటీలో నిలిచారు. వాస్తవానికి విసిల నియామకాన్ని రాజకీయ జోక్యం లేకుండా సర్చ్ కమిటీ ద్వారా గవర్నర్ పరిశీలన చేసుకొని నియమిస్తారు. ప్రభుత్వ పెద్దలు సూచించిన పేర్లనే గవర్నర్ ఆమోదం ముద్ర మేడం ఆనవాయితీగా మారింది. ఇప్పుడు చేపడుతున్న విసి నియామకానికి సంబంధించి బిజెపి అనుకూలంగా ఉండి నూతన విద్యా విధానాన్ని మరింత పక్కగా అమలు చేసే వారిని మాత్రమే నియమించనున్నట్లు తెలిసింది.

ఎస్‌డబ్ల్యుఎఫ్ నేత దివాకర్‌కు అవార్డు

ప్రజాసంఘాల నేతల అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎండితో అవార్డు అందుకుంటున్న దివారకర్

భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎపిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ , డిజిపి ద్వారకాతిరుమలరావుతో విజయవాడ హెడ్ ఆఫీస్‌లో ఫైనాన్స్ సెక్షన్లో సూపరిండెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ అవార్డు అందుకున్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకునికి అవార్డు రావడం పట్ల సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ కార్యదర్శి సంజీవ రాయుడు, ఎమ్మిగనూరు డిపో కార్యదర్శి ఆంజనేయులు, కర్నూల్ 2 డిపో నాయకులు సుంకిరెడ్డి, ఎస్‌ఆర్‌కె రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్మిక కర్షక భవన్‌లో ఎస్‌ఆర్‌కె.రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ అవార్డు ఎస్‌డ్ల్యుఎఫ్ సంఘానికి ఎంతో కీర్తిని సాధించి పెట్టిందని అన్నారు. ఫైనాన్స్ సెక్షన్లో సూపరిండెంట్‌గా ఉన్న దివాకర్ అంకితభావంతో క్రమశిక్షణతో పనిచేయడం అది ఎస్‌డబ్ల్యుఎఫ్ క్రమశిక్షణ సాధ్యమైందన్నారు. రూ.50 లక్షలకు పైగా సంస్థకు మిగులుబాటు చేసినందుకు, అంకితభావంతో పనిచేసినందుకు ఆయన ఈ అవార్డును అందుకున్నారన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యకర్తలను, నాయకులను నిబద్ధతతో పనిచేసే విధానాలను తీర్చిదిద్దుతుందని వారు కొనియాడారు. ఒకవైపు కార్మిక సమస్యలపై రాష్ట్రస్థాయిలో ఆందోళన చేస్తూనే పని పట్ల అంకిత భావంతో పని చేయడం అనేది ఎస్‌డబ్ల్యుఎఫ్‌కే సాధ్యమని అన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ లో ఉన్న నాయకులు కార్యకర్తలు మరిన్ని అవార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు. ఆర్‌టిసి ఎండితో అవార్డు అందుకున్న దివాకర్‌కు ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ కమిటీ తరపున అభినందించారు.

సర్పంచి జయన్నకు అభినందనలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జయన్నను అభినందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కర్నూలు మండలం బి తాండ్రపాడు గ్రామ సర్పంచి ఆగిపోగు జయన్నకు గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. బి తాండ్రపాడు జిల్లాలో ఆదర్శ గ్రామంగా ఎంపికైన విషయం తెలిసిందే. సర్పంచి జయన్న ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో స్వగ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామ సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఘనంగా స్వాగతం పలికి అభినందించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు తమ గ్రామం ఆదర్శ గ్రామంగా ఎన్నికవ్వడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అలాంటి గ్రామంలో తమ పని చేస్తున్నందుకు మిక్కిలి సంతోషిస్తున్నామన్నారు. భవిష్యత్తులో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ బి.గోపాల్, సచివాలయ ఉద్యోగులు షమీన, శ్రావణి, కృష్ణవేణి, లక్ష్మి, మౌనిక తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

యాజమాన్యంకు తొత్తుగా మారిన ఆర్ఐఒ

ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్. ఐద్వా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ఆర్ఐఒ కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి , మహిళా సంఘం నేతలు

ఎస్‌ఆర్ కళాశాలలో విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని ఎస్ఎఫ్ఐ, ఐద్వా ,ఎఐఎస్ఎఫ్ సంఘాల నాయకులు పేర్కొన్నారు. వెంటనే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ఐఒ గురువయ్య శెట్టికి ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ, అలివేలు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న లు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్‌ఆర్ కళాశాలలో ఆదివారం రాత్రి ఒక విద్యార్థినికి చేతికి కత్తితో పొడిచి జుట్టు కత్తిరించి క్షుద్రపూజలు చేసి విద్యార్థిని ఫోటో పై నిన్ను చంపుతామని రాశారని అన్నారు. విద్యార్థి తనకు జరిగిన సంఘటనను యాజమాన్యం దృష్టికి తెస్తే విచారణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విచారణ చేస్తున్న ఆర్ఐఒ నామమాత్రపు విచారణ చేసి కళాశాల యాజమాన్యానికి పూర్తిగా లొంగిపోయి పోయారన్నారు. దానికి ప్రత్యక్ష నిదర్శనం బాధిత విద్యార్థి లేకుండా వారి తల్లిదండ్రులు లేకుండా కళాశాల ప్రిన్సిపల్ లేకుండ ఎలా విచారణ చేస్తున్నారని, విద్యార్థి,మహిళా సంఘంగా ప్రశ్నించామన్నామన్నారు. గతంలో కూడా ఎస్‌ఆర్ బాయ్స్ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే ఇదే ఆర్ఐఒ విచారణ పేరుతో కాలయాపన చేశారన్నారు. గతంలో కూడా ఆర్ఐఒ గురువయ్య శెట్టి ఇదే వైఖరి అవలంబించారన్నారు. కళాశాల యాజమాన్యానికి తొత్తుగా మారి వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు శ్యామల, సుజాత, జయమ్మ ,ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ నగరం ఉపాధ్యక్షుడు నాయకులు పృథ్వి, ఎఐఎస్ఎఫ్ నాయకులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు, ప్రధానంగా యుక్త వయస్సు వారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. కోడుమూరు జివిఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కోబుమూరు సిహెసి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ బి.నాగరాజు , పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన కలిగే అనర్థాల పై అవగాహన కార్యక్రమం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తైమూర్‌బాష అధ్యక్షతన నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ విద్యార్థులు బీడీ సిగరెట్ , గుట్కా , ఖైని, గంజాయి, వైన్, హెరాయిన్, ఇ-సిగరెట్స్ తీసుకోవడం ద్వారా శారీరకంగా,మానసికంగా ఆర్థికంగా నష్టపోతారన్నారు. ప్రమాదకరమైన క్యాన్సర్, లివర్ ,గుండె సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. చదువులలో ఆటలలో ఆసక్తి చూపకపోవడం, భావోద్వేగ పరమైన ఒడిదుకులు, నిద్ర లేకపోవడం , వణకడం వంటి లక్షణాలు కనిపిస్తూ చివరకు ఆత్మహత్యలు , మరణాలు కూడా సంభవించే అవకాశం ఉందని తెలిపారు. ఈ హానికరమైన మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్యార్థులు భవిష్యత్తు కోసం జీవిత లక్ష్యాలు నిర్ణయించుకోవాలన్నారు. మంచి స్నేహితులతో సహవాసం చేయాలని, పోషకాహారం తీసుకోవాలని, యోగ, వ్యాయామం చేయాలన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు ఏవైనా ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే చికిత్స, కౌన్సిలింగ్ కోసం ఆశ లేదా ఎఎన్ఎంతో మాట్లాడి దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలన్నారు. మిగతా సమాచారం కోసం నేషనల్ టొబాకో కిట్ లైన్ సర్వీసెస్ 1098 లేదా 1800112356 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప , హెల్త్ సూపర్వైజర్ కమాల్ సాహెబ్, హెడ్‌నర్స్ లక్ష్మీదేవి ,కౌన్సిలర్ శ్వేత , పాఠశాల ఉపాధ్యాయులు, కోడుమూరు మూడో సచివాలయం హెల్త్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు , వేదికపై వైద్యాధికారులు

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఆర్‌టిఒ భరత్ చవాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్‌టిఒ భరత్ చవాన్ సూచించారు. మంగళవారం కర్నూలు కేంద్రీయ విద్యాలయంలో రోడ్డు భద్రత 36వ మాసోత్సవాలను డిటిసి ఎస్.శాంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్కూల్ బస్ డ్రైవర్లు, క్లీనర్లు విద్యార్థులు ,పాఠశాల సిబ్బంది హాజరయ్యారు. స్కూల్ పిల్లల డ్రైవర్ల క్రమం తప్పకుండా రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగించారు. విద్యార్థులను ఇంటి నుండి పాఠశాలకు, పాఠశాల నుండి నివాసానికి తీసుకెళ్లడానికి భద్రతను గూర్చి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత సదస్సును ఉద్దేశించి ఆర్‌టిఒ భరత్ చవాన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.నాగరాజా నాయక్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాబు కిషోర్ మాట్లాడారు. మోటార్ సైకిల్ నడుపుతున్నప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రాష్ డ్రైవింగ్, అధిక వేగం అత్యంత ప్రమాదకరమన్నారు. వాహనదారులు మత్తు పదార్థాలు, మద్యం సేవించి వాహనం నడపకూడదన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు డ్రైవింగ్ చేయడం ఎంతో ప్రమాదకరమన్నారు. అదే విధంగా కారులో ప్రయాణిస్తున్నప్పుడు సీట్ బెల్ట్‌ను ధరించడంతో పాటు పలు రోడ్డు భద్రత నియమాల ప్రాముఖ్యత గురించి వివరించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.నాగరాజ నాయక్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వి. బాబు కిషోర్, ఎన్.గణేష్‌బాబు, ట్రాన్స్‌పోర్ట్ హెడ్ కానిస్టేబుళ్లు చలపతి, వి.విజయ భాస్కర్, హోమ్ గార్డు, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, స్కూల్ యజమాన్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌టిఒ భరత్ చవాన్

మాట్లాడుతున్న మైనారిటీ సలహాదారులు మొహమ్మద్ షరీఫ్ అహమ్మద్

ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారులు మొహమ్మద్ షరీఫ్ అహమ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ పిఎస్‌షా వలి ఖాన్, రిజిస్ట్రార్ వి.లోకనాథతో కలిసి యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాలులో పవర్ పాయింట్ ద్వారా యూనివర్సిటీ అభివృద్ధి, నిలిచిన నిర్మాణాలకు నిధుల అవశ్యకత, సమస్యలు, ప్రస్తుత పరిస్థితి, విద్యార్థుల విజయాలు తదితర అంశాల పైన సమీక్షించారు. దీనిపై స్పందించిన ఆయన యూనివర్సిటీకి కావాల్సిన అన్ని మౌనిక వసతులను కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌర చరితా రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిని సబిహ పర్వీన్, ఎపి ఇడబ్ల్యుఐడిసి ఇఇ లక్ష్మీనారాయణ, ఎపిఎస్‌పి డిఎస్‌పి మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంహెఒ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డ్స్ రిపోర్ట్స్‌ను తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి తక్కువగా ఉన్నదని 100 పూర్తి చేయాలని ఆదేశించారు. ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పిలు ఆరోగ్య కార్యకర్తలకు సమావేశం నిర్వహించి వారితో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలన్నారు. ఆ వివరాలను సంబందిత రిజిస్టర్, పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు జరగకుండా అమ్మాయిలకు 18 యేళ్లు, , అబ్బాయిలకు 21 యేళ్లు పూర్తయిన తరువాత మాత్రమే వివాహాలు జరిగేలా చూడాలన్నారు. మూడేళ్లు తాత్కాలికంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు వాడాలని, ఆ తరువాతనే తల్లికి అవసరమైన శరీర ఆకృతిని కలిగి ఉంటారని, గర్భం దాల్చడానికి సిద్ధంగా ఉంటారని ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. డిఎంఒ నూకరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మోతీలాల్ నాయక్, ఆరోగ్య పర్యవేక్షకులు , ఎంఎల్‌హెచ్ పి లు , ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

పత్తి విక్రయానికి వచ్చిన రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. పట్టణ శివారులోని సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాలైన ఎన్‌డిబిఎల్, ధారశ్రీ పరిశ్రమలను అధికారులతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధరకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షించి, పరిశ్రమల పనితీరును పరిశీలించారు. జిల్లా మార్కెట్ యార్డు ఎడిఇ నారాయణమూర్తి, వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి, సిసిఐ నిర్వాహకులు భరత్ కుమార్, గౌతమ్, డిప్యూటీ తహశీల్దార్ గుండాల నాయక్, కాటన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్విలో తనిఖీలు చేస్తున్న ఆర్‌డిఒ

హాలహర్వి తహశీల్దార్ కార్యాలయాన్ని పత్తికొండ ఆర్‌డిఒ భరత్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన వివరాలను తహశీల్దార్ నజ్మా భానును అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో భద్రపరిచిన రికార్డులు, వీడియో కాన్ఫరెన్స్ గదులను పరిశీలించారు. **ఆస్పరి** తహశీల్దార్ కార్యాలయానికి సమస్యలపై వచ్చే రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించి పంపాలని, పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పించుకోరాదని పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రీ సర్వే చేపట్టే గ్రామాల్లో అవకతవకలు జరగకుండా ఫ్రీ సర్వీస్ సక్రమంగా నిర్వహించి, రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని తహశీల్దార్ శివశంకర్ నాయక్‌ను ఆదేశించారు. డిప్యూటీ తహశీల్దార్ రమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి శాశ్వతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎమ్మెల్యే విరుపాక్షిని సన్మానిస్తున్న నాయకులు

పార్టీ, పదవులే కాదు.. కార్యకర్తలే పార్టీకి శాశ్వతమని ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. మంగళవారం వైసిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని వైసిపి అనుబంధ విభాగాల్లో పదవులు చేపట్టిన ఆస్పరి మండలానికి చెందిన ప్రభాకర్ రెడ్డి (రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు), బాలయ్య శెట్టి (వాణిజ్య నియోజకవర్గం అధ్యక్షులు), లక్ష్మన్న యాదవ్ (కళాకార కల్చర్ నియోజవర్గ అధ్యక్షులు), డి.అశోక్ (ఆలూరు యూత్ వింగ్ అధ్యక్షులు)కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి ఆవిర్భావం నుంచి కార్యకర్తలే బలంగా ఉన్నారన్నారు. వివిధ అనుబంధ విభాగాల్లో పదవులు చేపట్టిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పదవులు పొందిన నాయకులు మాట్లాడుతూ... తమను గుర్తించి పదవులను ఇవ్వడం గౌరవంగా ఉందని తెలిపారు. వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే విరుపాక్షికి ఎప్పుడూ రుణపడి ఉంటామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

ఎపి స్టేట్ సైట్‌ను ప్రారంభించాలి. సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సచివాలయంలో పేదలందరికీ అవసరమయ్యే ఎపి స్టేట్ సైట్‌ను తక్షణమే ప్రారంభించాలని సిపిఎం నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రాముడు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా సచివాలయాల్లో సైట్‌ను రద్దు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. సచివాలయాలకు సంక్షేమ పథకాల సైట్‌ను ఓపెన్ చేసి దరఖాస్తులు తీసుకొని ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లక్ష్మీపేట, సంజీవనగర్, బైపాస్ రోడ్డు, ఎస్సీ కాలనీ, పట్టణ శివారు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, కొత్త పైపులైన్లు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ల్యాండ్ అప్రూవల్ కాకుండా ఉందని, వాటిని వెంటనే ల్యాండ్ అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సిపిఎం పట్టణ నాయకులు అబ్దుల్లా, రమేష్, సురేష్, తిమ్మప్ప, కాలప్ప, విజయ్ పాల్గొన్నారు.

మా పరిస్థితి ఏంటి..?

- కాస్త విషమిచ్చి చంపండి
- శ్రీమఠం భూములపై కౌలుదారుల తిరుగుబాటు
- అధికారులతో వాదన

ప్రజాశక్తి - మంత్రాలయం

గత 80 ఏళ్లుగా భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు భూమి లాక్కుంటే తమ పరిస్థితి ఏమిటని కౌలుదారులు ప్రశ్నించారు. మంగళవారం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు కారు పార్కింగ్ చేయాలని భావించిన వారికి కౌలుదారుల నుంచి చేదు అనుభవం ఎదురైంది. మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ఆధీనంలో ఉన్న సాగు భూముల కౌలుదారులు శ్రీమఠం అధికారులపై తిరుగుబాటు చేశారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వస్తున్న భక్తుల రద్దీ పెరగడం వల్ల ప్రతి గురు, శని, ఆదివారాలు ప్రధాన రహదారుల్లో వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గమనించిన పీఠాధిపతులు పరిష్కార మార్గం వైపు దృష్టి సారించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట కారు పార్కింగ్‌ను నాగలదిన్నె రహదారిలో ఉన్న శ్రీమఠం భూమి సర్వే నెంబరు 151లో గల 10 ఎకరాల భూమిని ఎంపిక చేసి పూజ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న కౌలుదారులు అక్కడికి చేరుకుని శ్రీమఠం అధికారులు, ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, గురురాజ రావు, నాగరాజ రావుతో వాగ్వాదానికి దిగారు. గత 80 ఏళ్ల తరబడి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు భూమి లాక్కుంటే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పక్కనే ఉన్న 150 సర్వే నెంబరు గల భూమి గతంలో కరణంగా పని చేసిన భక్తవత్సల స్వామిపై పట్టా ఎలా వచ్చిందని, దానిని అమ్ముకున్నప్పుడు మీరు ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. రాఘవేంద్రస్వామి ఇక్కడికి రాక ముందు కూడా మంచాల గ్రామం ఉండేదని, అప్పటికే పట్టా భూములు ఉన్నాయని తెలిపారు. ఈ ఊరిలో ఎవరు ఏమిటనేది జాతకాలు తెలుసని, బయట పెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దని అటవీశాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా విరమణ పొందిన రాఘన్న హెచ్చరించారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టా భూములు కూడా శ్రీమఠం భూములుగా మారాయని, రైతులను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కాస్త విషమిచ్చి చంపితే ఇక మీకు తిరుగుండదని ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాములు, ధనవంతులకు పట్టా భూములు ఎలా వచ్చాయో తెలపాలని వీరయ్య శెట్టి, వనికె నాగరాజు, కయ్యూన్, ఏబు వ్యతిరేకించడంతో శ్రీమఠం అధికారులు వెనుదిరిగారు.


మాట్లాడుతున్న శ్రీమఠం అధికారులు

అధికారులను వివరణ కోరగా... స్పందించిన శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ మాట్లాడుతూ... పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మంత్రాలయం అభివృద్ధి వైపు నడుస్తోందని తెలిపారు. భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ ఏర్పాటు చేయాలని ముందుగా కౌలుదారులకు మూడు నోటీసులు ఇచ్చామని తెలిపారు. వారి నుంచి ఎలాంటి సమాధానమూ లేదని చెప్పారు. భూమిని వదలకుండా ఎదురు తిరిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తిరుగుబాటు చేయడం వల్ల అభివృద్ధికి ఆటంకం కలిగించిన వారవుతున్నారని తెలిపారు. భూమిని ఇస్తే జీవనం కష్టంగా ఉంటుందని, పీఠాధిపతుల దృష్టికి తీసుకెళ్తే ఆయన కచ్చితంగా ఆలోచించి ఉద్యోగం కానీ, ఉపాధి కానీ చూపిస్తారని, అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రాధాన్యత పనులకు నిధులు మంజూరు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 13 పంచాయతీల్లో ప్రాధాన్యత ఉన్న అభివృద్ధి పనులు చేసుకోవడానికి ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద రూ.1.50 కోట్ల నిధులు మంజూరవుతున్నాయని ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ ఎఇ సోమప్ప, ఆర్‌డబ్ల్యుసి ఎఇ వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపిపి జూటూరు హేమలత భర్త, వైసిపి కన్వీనర్ జూటూరు మారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా తాగునీటి వసతి కల్పించేందుకు, నూతన పైపులైన్ వేసేందుకు, వాటర్ ప్లాంట్ లేని పంచాయతీల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి, డ్రెయినేజీల నిర్మాణం, శానిటేషన్ పనులన్నీ ఆయా పంచాయతీల సర్పంచులతో మాట్లాడి సకాలంలో పూర్తి చేసుకుంటే ఆస్పిరేషనల్ బ్లాక్ కింద వచ్చే నిధులను వెంటనే విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల వరకు నిధులు మంజూరవుతాయని తెలిపారు. హౌసింగ్ ఎఇ భవ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

దాహంతో అల్లాడుతున్నారు..!

- మా గ్రామానికి నీరివ్వండి
- సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసి ఆవేదన

ప్రజాశక్తి - నందవరం

తాగేందుకు నీరు లేక గ్రామస్తులు దాహంతో అల్లాడిపోతున్నారని జగ్గాపురం ఎంపిటిసి హనుమంతమ్మ సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నందవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి లక్ష్మీ దేవమ్మ అధ్యక్షతన, ఎంపిడిఒ పుల్లయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరణ ఇవ్వాలని వివిధ శాఖల అధికారులను కోరారు. జగ్గాపురం గ్రామానికి చెందిన ఎంపిటిసి హనుమంతమ్మ మాట్లాడుతూ... 'గ్రామంలో తాగునీరు లేక ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. వాడుకోవడానికి నీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఫిబ్రవరిలో గ్రామంలో పండగలు జరుగుతాయి. ఆ పండగలకు బంధువులను ఆహ్వానించాలంటే నీటి కొరత భయాన్ని కలిగిస్తుంది. అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు'ని మండిపడ్డారు. తమ గ్రామానికి నీటి కొరతను తీర్చాలని కోరారు. ఇఒఆర్‌డి సందీప్ మాట్లాడుతూ... మండలంలో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. జగ్గాపురం గ్రామం నీటి ఎద్దడిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. పండగల సమయంలో వాటర్ ట్యాంకు ద్వారా జగ్గాపురం గ్రామానికి సరిపడ నీటిని సరఫరా చేస్తామని హామీఇచ్చారు. గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. గ్రామాల్లో విద్యుత్ వృథా కాకుండా.. మధ్యాహ్న సమయంలో వీధిలైట్లు వెలగకుండా స్తంభాలకు ఆన్, ఆఫ్ ఏర్పాట్లను చేయాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం వల్ల ప్రజలు సంపాదించిన డబ్బును అనారోగ్యానికి ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని చెప్పారు. ఎంఇఒ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి పాఠశాలకూ ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలను హైస్కూల్‌గా మార్చుతుందని తెలిపారు. అందులో భాగంగా మాచాపురం గ్రామంలో గల పాఠశాలను హైస్కూల్‌గా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రజలకు అన్ని ఆరోగ్య సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. మండలంలోని ప్రజారోగ్య అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. వారంలో ఒకసారి ప్రజలకు వివిధ రకాల వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాల దగ్గరికెళ్లి చిన్నపిల్లలకు టీకాలు, ట్యాబ్లెట్లు ఇస్తామని చెప్పారు. డిప్యూటీ తహశీల్దార్ శశికుమార్ మాట్లాడారు. భూసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నది కైరవాడి గ్రామాన్ని పైలట్ గ్రామంగా నియమించి పకడ్బందీగా రీసర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యుత్ అధికారి నాగేంద్ర మాట్లాడారు. మండలంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా ప్రతి వీధిలోనూ విద్యుత్ దీపులను ఏర్పాటు చేయాలనుకున్నామని తెలిపారు. అందుకు ప్రజలు సహకరించడం లేదని, వాటిని ఏర్పాటు చేయడానికి ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వాటిని ఏర్పాటు చేయడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని తెలిపారు. ప్రజలను ఒప్పించి డీపీను ఏర్పాటు చేయడానికి సహకరించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరారు. ఎపిఒ శ్రీనివాసులు మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు పొలాల్లో ఇంకుడు గుంతలు, పొలం చుట్టూ కాలువలు తీయించుకోవాలని చెప్పారు. పొలంలో ఉన్న భూసారం కొట్టుకుపోకుండా ఉంటుందని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుచరిత మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ముగతి సర్పంచి విరుపాక్షి రెడ్డి, తిమ్మప్ప, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిటిసి హనుమంతమ్మ

మాట్లాడుతున్న సరోజ

కానిస్టేబుల్ నుంచి ప్రాణహాని

- గొంతుపై కత్తి పెట్టి చంపడానికి ప్రయత్నించారు
- రూ.లక్ష తీసుకెళ్లారు
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - దేవనకొండ

కౌతాళం పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ సోమ్లా నాయక్ నుంచి తనకు ప్రాణహాని ఉందని బోయ సరోజ వాపోయారు. మంగళవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇంట్లో ఉండగా సోమ్లా నాయక్, నలుగురు పురుషులు, ఒక మహిళ తెల్లటి కారులో తమ ఇంటి దగ్గరికొచ్చి పొలం అమ్ముతారా అని అడిగి లోపలికి వచ్చి 'మీతో మా సార్ మాట్లాడతార'ని చెప్పారని అన్నారు. ఒక్కసారిగా అందరూ ఇంట్లోకి చొరబడి తలుపులు మూసి దుర్భాషలాడుతూ 'ఒంటరిగా చిక్కావు. ఇప్పుడు నీకెవరు అడ్డొస్తారు. నిన్ను చంపితే ఏ విధంగా తప్పించుకోవాలో నాకు తెలుసు. నేను పోలీసును' అంటూ పిడుబాకును తన గొంతుపై పెట్టి బెడ్ రూమ్‌లోకి ఈడ్చుకెళ్లారని వాపోయారు. మంచంపై పడేసి ఛాతిపై మోకాలితో ఒత్తిపెట్టగా మరో ఇద్దరు తనను పట్టుకున్నారని తెలిపారు. మిగతా వారు తన కొడుకును పట్టుకొని గొంతుపై కత్తి పెట్టి 'మేము చెప్పినట్టు వింటే నీ కొడుకును వదిలేస్తాం' అన్నారని తెలిపారు. బీరువాలోని హ్యాండ్ బ్యాగులో ఉన్న రూ.లక్ష నగదు డబ్బులు తీసుకుని.. 'ఇంతేనా. ఇవి మాకు సరిపోవు' అని తన గొంతులో ఉన్న సుమారు 10 తులాలు తాళి బొట్టు చైన్, చిన్న లాకెట్ చైన్‌ను లాక్కున్నారని చెప్పారు. బ్యాంకు చెక్కులపై బలవంతంగా సంతకాలు తీసుకున్నారని, తన పేరుపై ఉన్న మిగతా బ్యాంకు అకౌంట్లు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, బరోడా బ్యాంకుకు సంబంధించిన చెక్ బుక్‌లతోపాటు ఏటిఎం కార్డులు, సెల్‌ఫోన్లు తీసుకెళ్లారని తెలిపారు. తనను, అబ్బాయిని బెడ్ రూమ్‌లోకి తోసి గడియ పెట్టి గ్యాస్ సిలిండర్‌ను హాలులో పెట్టి ఓపెన్ చేసి 'చావండి' అంటూ వెళ్లిపోయారని వాపోయారు. తాము కేకలు వేయడంతో పొలానికి వెళ్లే వారు వచ్చి తలుపు తీశారని తెలిపారు. తనను, తన కుమారుని చంపడానికి వచ్చిన సోమ్లా నాయక్, మిగతా ఐదుగురిపై చట్టపరమైన చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని కోరారు.

మహారాజ శ్రీ నందికొట్కూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

IA No.53/2023 in IP No.29/20215

1.ఇ.పి.నబిరసూల్. ...అర్జిదారు

-Vs-

1.ఎ.జయప్రకాష్ (2) కె.వరలక్ష్మి పోతివారసులు
జి.బాగ్యమ్మ వగైరా. ...రెస్పాండెంట్లు

8,13,15 రెస్పాండెంటుకు సిపిసి సెక్షన్ 151 ప్రకారం నోటీసులు

8) పి.చిన్న హుసేన్ సాహెబ్ తండ్రి పి.బాలసాహెబ్, ఎన్.గణపురం గ్రామము, పగిద్యాల మండలం, కర్నూలు జిల్లా, ప్రస్తుతం నంద్యాల జిల్లా.
13) కె.పాపిరెడ్డి వాటర్ ప్లాంట్, సాయిబాబా దేవాలయం దగ్గర, నందికొట్కూరు, కర్నూలు జిల్లా. ప్రస్తుతం నంద్యాల జిల్లా.
15) రామప్రసాదు, నలందా ఆపార్టుమెంటు, రాజీవ్‌నగర్, దగ్గర, కర్నూలు.

పై నెంబరు ఐపిలో అర్జిదారు 8,13,15 రెస్పాండెంట్లు పేర కర్నూలు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐ.ఎ.180/2016, ఇన్ ఓ.ఎస్.నెం.177/2016లో ఉన్న మొత్తంను రెస్పాండెంట్లు దారుల తాలుకు హోల్ జప్తి కాబడి ఉన్న మొత్తమును పై ఐ.పి.నెం.29/2015లోకి సెండ్‌ఫర్ చేయమని అర్జిదారు అర్జిదాఖలు చేసినారు. ఇందులో 8,13,15 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 14-02-2025 పగలు 10.30 గం॥కు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును. 8వ రెస్పాండెంటు మొత్తము రూ॥3,60,000/- 13వ రెస్పాండెంటు మొత్తం రూ॥3,00,000/- మరియు 15వ రెస్పాండెంటు మొత్తం రూ॥ 1,00,000/-

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

కడియాల రామపుల్లయ్య,
అర్జిదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

IN THE COURT OF THE IV TH ADDL JR.CIVIL JUDGE : KURNOOL
I.A.NO.7/2025 - O.S.NO.35/2022

CAPITAL INFRA PROJECTS & DEVELOPERS KURNOOL, R/BY MANAGING PARTNER SAYYAD ARSHAD, S/O SAYYAD ABBAS MIAH, BUSINESS, H.NO.8-2-693, LAPOLOMA CAVES, ROAD NO-12, BANJARAHILS, HYDERABAD.
...PETITIONER/DEFFENDANT

- VS -

G.RAJESH KUMAR MULCHAND S/O G. MULCHAND, H.NO.6-86, NEAR TOLL PLAZA, PALLUR (VI), MANOPADU (M), MAHABOOB NAGAR (DT).
...RESPONDENT/PLAINTIFF

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామము మరియు జోహరాపురం గ్రామము ప్రజలకు తెలియజేయడమ ఏమనగా పై నెంబర్ దావాలో వాది/రెస్పాండెంటు 27.08.2024 తేదిన Exporter డిక్రి పొందినాడు. సదరు డిక్రిని రద్దుచేయమని ప్రతివాది/అర్జిదారు (ఆర్డర్-9, రూల్-13), O-9, R-13 C.P.C ప్రకారము అర్జి దాఖలు చేసినాడు. వాయిదా 16-04-2025 తేదిన ఉన్నది. అర్జి పెండింగ్‌లో ఉన్నది. ఇందులో వాదితో షెడ్యూలు ఆస్థిపైన ఎవరైనా ఎలాంటి లావాదేవీలు జరిపిన చెల్లనేరదు.

షెడ్యూలు :

All that part and parcel of land situated in sy.no.118, sub division, 118/2 situated in 69th ward extended area, situated in joharapuram, (vi) of kurnool municipal corporation limts, kurnool district, situated in R.D.Of kurnool in sy no-118/2 to an extent of Ac-0.90 cents, with the following boundaries :
East : Land belongs to M.Devadasu S/o Madanna in sy.118/3
West : Rasta and land in Sy.No-105,
North : Land belongs to Pokraj in same Sy.No.118/2
South : Land belongs to P.Subba Reddy. Sy.No.119.

ఆర్.ఆనందరావు,
అడ్వకేటు, కర్నూలు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజల్లో నమ్మకం ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. టిడిపి పాలనలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులైన వైసిపికి చెందిన నాయకులు టిడిపిలో చేరినట్లు చెప్పారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులకు టిడిపి కార్యాలయంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ముఖ్య అనుచరులు వాల్మీకి సోదరులు ముక్రలు కర్రన్న కూమరులు భీమన్న, అంజనయ్య, హనుమంతు, రాముడు, దుల్లయ్య, పూల రాముడు, అలీ బాషా, వీరేష్, హరి, రాజశేఖర్, రామలింగయ్యతో పాటు దాదాపు 30 కుటుంబాలు బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, యువ నాయకులు మాధవరం కృష్ణ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నుంచి టిడిపిలో చేరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, వెంకటేశప్ప పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి కార్యకర్తలకు అండగా ఉంటారని, ఆయన నాయకత్వంలో పని చేస్తామని పార్టీలో చేరిన చెప్పారు. తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, యువ నాయకులు పవన్ కూమార్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వట్టెప్ప గారి నరసింహులు, తెలుగు యువత మండల అధ్యక్షులు సాయి కూమార్, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సల్మాన్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యోబు, సుంకప్ప, డీలర్ లక్ష్మన్న, నవకోట్టి నారాయణ, పైబావి నర్సారెడ్డి, స్కూల్ ఛైర్మన్ నర్సారెడ్డి, నరసింహులు, భీమేష్ పాల్గొన్నారు.

శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రాష్ట్ర జట్టులో ఆదోని క్రీడాకారులు

ప్రజాశక్తి - ఆదోని

వైజాగ్ జిల్లా అనకాపల్లి అంకపాలెంలో ఈనెల 25 నుంచి 27 వరకు జరిగిన రాష్ట్ర కబడ్డీ జట్టు తరఫున ఆదోని క్రీడాకారులు ఆడడం అభినందనీయమని కబడ్డీ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ, ఫిలిప్స్ కబడ్డీ జట్టు కోచ్ అమర్ ప్రకాష్ తెలిపారు. టోర్నమెంట్‌లో ఆడిన క్రీడాకారులను మంగళవారం ఆదోనిలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందులో 13 జిల్లాల మహిళలు, పురుషులు కబడ్డీ జట్లు పాల్గొన్నాయని తెలిపారు. కర్నూలు జిల్లాకు మూడోస్థానం (బ్రాంజ్ మెడల్) రావడం సంతోషకరమన్నారు. జిల్లా సెక్రటరీ ఆర్.శుభకర్, జాయింట్ సెక్రటరీ అమర్ ప్రకాష్, ట్రెజరర్ సురేష్, సెలక్షన్ కమిటీ గోవిందు, విజయ్, శీలన్న టోర్నమెంట్‌ను పరివేక్షించారని తెలిపారు. జిల్లా తరఫున ఆదోని ఫిలిప్స్ టీం బి.రాజు, అవినాష్, వాల్మీకి జంపన్న, సుమంగళి, సంధ్య మంచి ప్రతిభ కనబరిచినందుకు ఆదోని ఫిలిప్స్ కబడ్డీ టీం సీనియర్, జూనియర్ క్రీడాకారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక మద్యాన్ని తరలించినా, విక్రయించినా చర్యలు తప్పవని ఆదోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. మంగళవారం స్వాధీనం చేసుకున్న మద్యాన్ని కార్యాలయంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌతాళం మండలం హాల్వి గ్రామంలో కురువ రాము, మహబూబ్ బాష ఇంటి ఆవరణలో సోదాలు చేశామన్నారు. స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉంచిన 7 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 672 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

హత్య కేసు నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి - హోళగుంద

ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ కురువ ఈరన్నను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కురువ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కురువ సంఘం హోళగుంద మండలం లింగంపల్లి నాయకులు నెరణికి రవి, హెబ్బటం శ్రీను, శంబులింగ, మౌనేష్ పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిరాణానికి విరాళం ఇచ్చినట్లు జూనియర్ అసిస్టెంట్ కుమారయ్య తెలిపారు. మంగళవారం ఆలూరుకు చెందిన గూడూరు జ్యోతి, భాస్కర్ శెట్టి రూ.1,00,116 కార్యాలయంలో విరాళంగా చెల్లించారన్నారు. అధికారులు దాతలకు స్వామివారిని దర్శనం కల్పించారు. బాండు పేపర్ అందించి పూలమాల వేసి సన్మానించారు.

పెద్దహ్యాటలో సిసి రోడ్లకు భూమిపూజ

ప్రజాశక్తి - హోళగుంద

భూమిపూజ చేస్తున్న నాయకులు

మండలంలోని పెద్ద హ్యాట గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. జడ్‌పి వైస్ ఛైర్మన్ బావ శేషప్ప, సర్పంచి ఏసాన్ బాష మాట్లాడారు. గ్రామంలో ఎమ్మెల్యే వి.విరుపాక్షి ఆదేశాల మేరకు జడ్‌పిటిసి నిధులు రూ.5 లక్షలతో వీరేశ్ ఇంటి నుంచి భద్ర ఇంటి వరకు సిసి రోడ్డుకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.గిరి, ఎంపిటిసి శివన్న, నాయకులు ముద్దప్ప, పంపా రెడ్డి, శేఖర్, నాగప్ప, ఆటో మల్లయ్య, చిన్నహ్యాట మల్లయ్య, పెద్దహ్యాట మల్లయ్య, వీరేష్, భద్ర, మర్రిస్వామి, దర్గప్ప పాల్గొన్నారు.

నల్లచెలిమలలో కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని నల్లచెలిమల రైతు సేవా కేంద్రంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎఒ సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంది పంట మద్దతు ధర రూ.7,550 నిర్ణయించినట్లు తెలిపారు. తేమ శాతం 12లోపు ఉండాలని చెప్పారు. మండలంలోని రైతులందరూ ఈ కనీస మద్దతు ధరను ఉపయోగించుకోవాలని కోరారు. సర్పంచి సవారమ్మ, డిసిఎంఎస్ మేనేజర్ రామకృష్ణ, ఎఇఒలు రంగన్న, అబ్దుల్ సలాం, గ్రామ పెద్దలు నర్సోజి, బాలకృష్ణ, నరసింహుడు, ఉచ్చీరప్ప, రైతులు పాల్గొన్నారు.

గంజాయి మాఫియాను అరికట్టాలి

- మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోనూ, పరిసర గ్రామాల్లోనూ గంజాయి మాఫియాను అరికట్టాలని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో గంజాయి మాఫియా విచ్చలవిడిగా అమ్మకాలు జరిపినా పట్టించుకున్న అధికారి లేరని, గంజాయి వాడకం దారులు దొరికినా గంటలోనే పోలీసు స్టేషన్ నుంచి తిరిగి వచ్చేవారని తెలిపారు. సుదర్శన్ రెడ్డి సిఐగా కొద్దికాలం పని చేసినా గంజాయి మాఫియాను అణగదొక్కారని, ప్రస్తుతం మళ్లీ గంజాయి మాఫియా అమ్మకాలు సాగిస్తోందని చెప్పారు. ఎమ్మిగనూరులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, వీవర్స్ కాలనీ గ్రౌండ్, సోగనూరు రోడ్డు, కర్నూలు బైపాస్ రోడ్డు, ఫైర్ స్టేషన్ ప్రాంతాల్లో గంజాయి విక్రయించడం జరుగుతోందని తెలిపారు. నందవరం, సోమలగుడూరు గ్రామాల్లో ఏకంగా గంజాయి పంట వేసి అమ్మకాలు జరుగుతున్నాయంటే పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా అర్థమవుతోందని విమర్శించారు. ఇటీవల పట్టణంలో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను పట్టుకోగా వారిపై కేసు నమోదు చేయకుండా, వారి వెనుక ఉన్న ముఠాను పట్టుకునే ప్రయత్నం చేయకుండా వదిలివేశారని చెప్పారు. పోలీసుల నిర్లక్ష్యం, వారి పాత్ర వల్ల ఎమ్మిగనూరు ప్రాంతంలో గంజాయి అమ్మకాలు కొనసాగుతున్నాయన్నారు. గంజాయి పండించి వ్యాపారం చేసే విషయంలో ఒక కానిస్టేబుల్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, గతంలో కర్ణాటక 'బుడ్డీల' అమ్మకాలు కూడా ఇతను చేయించారని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వినయ్ చంద్రకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అర్చకులు

ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆహ్వానం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి మహా కుంభాభిషేకానికి రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ చంద్రకు డిప్యూటీ కమిషనర్ విజయ రాజు ఆహ్వానించారు. మంగళవారం విజయవాడలోని కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ స్వామి, దేవాలయ వేద పండిట్ మోహన మురళీకృష్ణ శర్మ, పర్యవేక్షకులు వెంకటేష్ పాల్గొన్నారు.

మందకృష్ణ 'పద్మశ్రీ'పై హర్షం

ప్రజాశక్తి - ఆస్పరి

మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల ఎంఎస్‌పి జిల్లా కార్యదర్శి సంజప్ప మాదిగ, ఎంఎస్‌పి మండల కార్యదర్శి రామాంజనేయులు మాదిగ, ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జీ సంజన్న మాదిగ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక బస్టాండ్ నుంచి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సర్కిల్ వరకు డప్పులతో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఫిబ్రవరి 7న 'చలో హైదరాబాద్'కు ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నాగరాజు, పరమేష్, కరుణాకర్, కోదండ, రామాంజనేయులు, రంగస్వామి, మహానంది పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - కౌతాళం

ఉత్తమ సేవలందించిన అధికారులకు కూటమి నాయకులు సన్మానం చేశారు. కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎంపిడిఒ సుబ్బరాజును జనసేన, బిజెపి మండల నాయకులు సన్మానించారు. మంగళవారం జనసేన, బిజెపి మండల నాయకులు రామాంజనేయులు, నబీ, రాంబాబు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అధికారులు ప్రజలకు మంచి సేవలు అందించినప్పుడే ఇలాంటి ప్రశంసలు అందుకుంటారన్నారు. మల్లికార్జున, దేవదాస్, పరమేష్, మహబూబ్ పాల్గొన్నారు.

అధికారులను సన్మానిస్తున్న నాయకులు